
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జయశంకర్ భూపాలపల్లి
బుధవారం 24 సెప్టెంబరు 2025

బ్లాక్ మార్కెట్‌లోకి యూరియా!



- అరికట్టలేకపోతున్న అధికారులు
- పట్టుబడితే తప్ప చర్యలు శూన్యం
- నిద్రావస్థలో వ్యవసాయ శాఖ
- రాత్రివేళల్లో పక్క దారిపడుతున్న ఎరువులు

6





గద్దెల ప్రాంగణంలో గంటలు కొడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క



సమ్మక్క గద్దె వద్ద సీఎం రేవంత్ రెడ్డి మొక్కులు



సమ్మక్క గద్దె వద్ద సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంపీ తదితరులు

వనదేవతల దీవెనలతో దొరల పాలన అంతం

- ప్రజా ఆశయాలకు అనుగుణంగానే పరిపాలన
- మేడారంలో రామప్పను పోలిన రాతి కట్టడాల నిర్మాణం
- వందల ఏళ్లు గడిచినా చెక్కుచెదరొద్దనే సంకల్పం
- 100 రోజుల్లో పనులన్నీ పూరి చేస్తాం
- జాతరకు కేంద్రం జాతీయ హోదా ఇవ్వాలి
- మేడారం బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

ములుగు/తాడ్వాయి సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి అంటే అద్దాల మేడలు కాదని, ప్రజల జీవన ప్రమాణాలు అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రస్తుత ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని వనదేతల సన్నిధి మేడారంలో సీఎం మంగళవారం పర్యటించారు. ఇక్కడ చేపట్టిన మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఎల్ఈడీ స్ర్కీన్‌లపై మాస్టర్ ప్లాన్ డిజైన్ రూపకల్పన వీడియోను ప్రారంభించారు.

గద్దెల ప్రాంగణం పరిసరాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 2023 ఫిబ్రవరి 6న మేడారం సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద మొక్కులు అప్పగించానని తెలిపారు. దొరల పాలనను అంతమొందించి ప్రజా పాలన తీసుకొస్తామని వనదేతల సాక్షిగా సంకల్పించానని అన్నారు. దీంతో తల్లుల దీవెనలు తోడై ప్రజల ఆశీస్సులతో అధికారం చేపట్టామన్నారు. అభివృద్ధి అంటే అద్దాల మేడలు కాదని, రంగుల గోడలు అంత కన్నా కాదని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పని చేయాలని అప్పుడే సంకల్పించామన్నారు.

దేశ మూల వాసులైన ఆదివాసీలు, లంబాడీల ప్రాంతాలను అభివృద్ధిలో ముందుకు నడిపించాలని ప్రణాళికలు రూపొందించామన్నారు. తండాలు, గూడాలలో అభివృద్ధి చేపట్టామని, ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేశామని అన్నారు. మేడారం రావడానికి ముందు వాతావరణం అనుకూలంగా లేదని, వర్షసూచన ఉందని నిపుణులు చెప్పారు. కానీ, తనకు

(మిగతా 7లో..)

రాతి కట్టడాలు

సిమెంట్‌తో కట్టిన నిర్మాణాలు 100 ఏళ్ల వరకే ఉంటాయని, అదే రాతి కట్టడాలు అయితే వేల సంవత్సరాలు అయినా చెక్కుచెదరవని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మన ప్రాంతంలో రుద్రదేవుడు నిర్మించిన రామప్ప దేవాలయంలా మేడారం దేవస్థానాన్ని రాతి కట్టడాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. వందల ఏళ్లయినా చెక్కుచెదరొద్దనే సంకల్పంతో నిర్మాణాన్ని చేపడుతున్నామని, కేంద్ర ప్రభుత్వం కుంభమేళాకు వేలకోట్లు నిధులు ఇచ్చిందని, ప్రఖ్యాత మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరకు ఇవ్వడం లేదని అన్నారు. జాతీయ హోదా కూడా కల్పించలేదని అన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు మేడారానికి నిధులు తెచ్చేందుకు కృషి చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు.

ఏ ముఖ్యమంత్రి కూడా చేయని అభివృద్ధి : మంత్రి సీతక్క



మేడారం మహా జాతరకు ముందు ఏ ముఖ్యమంత్రి కూడా ఇక్కడికి రాలేదని మంత్రి సీతక్క అన్నారు. వెయ్యేళ్ల సమ్మక్క-సారలమ్మల కీర్తిని చాటేలా సీఎం రేవంతోరెడ్డి సహకారంతో కొత్త ప్రణాళికలను రూపొందించామన్నారు. దేవస్థానం ఆధునికీకరణ పనులు చేపడుతుండడంతో తన జన్మ ధన్యమైందన్నారు. అభివృద్ధి పనుల కోసం తాను అడిగిది ఆవగింజైతే తల్లులపై ఉన్న విశ్వాసంతో ముఖ్యమంత్రి కొండంత నిధులను మంజూరు చేశారని హర్షం వ్యక్తం చేశారు.

వడి వడిగా సాగిన సీఎం పర్యటన

- గద్దెల పరిసరాల్లో పూజారులతో సమీక్ష సమావేశం
- ఆదివాసీ నృత్యాలతో ఘన స్వాగతం
- వనదేవతలకు ప్రత్యేక పూజలు
- 68 కిలోల ఎత్తు బంగారం సమర్పణ

7

పోలీసుల భారీ బందోబస్తు

సీఎం రేవంత్‌రెడ్డి మేడారం పర్యటన నేపథ్యంలో ఎస్పీ శబరీశ్ నేతృత్వంలో పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వెయ్యి మందితో భద్రతను కట్టుదిట్టం చేశారు. హెలీప్యాడ్ నుంచి మొదలుకొని తల్లుల దర్శనం వరకు రోప్ పార్టీలు సీఎం వెంటే ఉన్నాయి. కార్యకర్తలు, భక్తులు, ప్రజలు రద్దీని నియంత్రిస్తూ పోలీసు సిబ్బంది శ్రమ పడాల్సి వచ్చింది.

మంగపేట రెవెన్యూ గ్రామాలపై 'సుప్రీం' ఆర్డర్స్

- ట్రైబల్ ఏరియాగా పరిగణించొద్దన్న సర్వోన్నత న్యాయస్థానం
- ఎన్నికలు నిర్వహించొద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు

ములుగు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలను షెడ్యూల్డ్ ట్రైబల్ ఏరియాగా పరిగణించొద్దని దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టు స్పందించింది. ఆ గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతాలుగా పరిగణించలేమని, దీనిపై వాదనలు పూర్తయి తీర్పు వచ్చే వరకూ ఎన్నికలు నిర్వహించొద్దని పేర్కొంది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులను మంగళవారం జారీ చేసింది.

మంగపేట మండలం విషయంలో షెడ్యూల్డ్, నాన్ షెడ్యూల్డ్ అనే వివాదం సుదీర్ఘకాలంగా నడుస్తోంది. ఈ క్రమంలో గతంలో పలువురు గిరిజనులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో రెండు వర్గాల వాదనలు విన్న హైకోర్టు మంగపేటలోని 23 రెవెన్యూ గ్రామాలు గిరిజన ప్రాంతాలేనని తేల్చింది. సింగిల్, డివిజన్ రెండు బెంచ్‌లు ఈ మేరకు తీర్పును వెలువరించగా దీనిపై గిరిజనేతరులు పూజారి సమ్మయ్య, సి.హెచ్.పరమాత్మతోపాటు మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేశారు. ఇదేక్రమంలో సుప్రీం కోర్టులో మంగళవారం ఈ కేసు విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు, గిరిజనుల తరుపు న్యాయవాదులు తమ వాదనలను సుప్రీంకోర్టు ఎదుట వినిపించారు. సుదీర్ఘ వాదనల అనంతరం న్యాయమూర్తులు జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్ ధర్మాసనం స్పందిస్తూ మంగపేట మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలను గిరిజన ప్రాంతాలుగా పరిగణించరాదని, అక్కడ ఎలాంటి ఎన్నికలు నిర్వహించొద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే హైకోర్టు తీర్పుపై స్టే విధించింది. మంగపేట మండలానికి సంబంధించిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌పై పూర్తి వాదనలు 2026 ఫిబ్రవరి 16న వింటామని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై పంచాయతీరాజ్ శాఖ జిల్లా అధికారి దేవరాజ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట కార్మికుల ధర్నా

పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్

ఏటూరునాగారం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, పారిశుధ్య కార్మికులు మంగళవారం ధర్నాకు దిగారు. నాలుగు నెలలగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజేషన్ మాదరి నర్సింహారావు ఆధ్వర్యంలో ఈ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల పెండింగ్ జీతాల కోసం ఈనెల 9న ప్రభుత్వ అధికారులకు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. అధికారులు స్పందించకపోవడంతో ఈనెల 16న హైదరాబాద్‌లో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించామని గుర్తు చేశారు. ఆ ధర్నాకు స్పందించిన ఉన్నత అధికారులు కేవలం రెండు, మూడు రోజుల్లోనే పెండింగ్ జీతాలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, అయితే వారం రోజులు గడిచినా ఇంతవరకు జీతాలు విడుదల చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి తమ సమస్యను మరోసారి తీసుకురావడానికే ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని వివరించారు. మరో రెండు రోజుల్లో జీతాలు విడుదల చేయకపోతే భవిష్యత్తు కార్యచరణ రూపొందించి, ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆస్పత్రిలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పాటు బూర సునీల్‌కుమార్, సుధాకర్, కృష్ణ, మురళి పాల్గొన్నారు.



ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది

గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు



గాయత్రీదేవి అలంకరణలో శుభానందదేవి అమ్మవారు

మహదేవపూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వర దేవస్థానంలో శుభానందదేవి అమ్మవారు మంగళవారం గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. నవరాత్రల్లో భాగంగా అమ్మవారి వద్ద గణపతి లలితార్చన, గణపతి నవగ్రహ రుద్ర పంచసూక్త హోమాలు, రాజ్యశ్యామలార్చన, లలితార్చన, మూలమంత్ర చండీ హోమాలు, లలిత పారాయణం, చండి అర్చన, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో అర్చకులు, ఆలయ అధికారులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి



కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం

మహదేవపూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద నెమ్మదిగా పెరుగుతూ వస్తోంది. మంగళవారం కాళేశ్వరం వద్ద 9.59మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహించింది.

సమ్మక్క, సాగర్, దేవాదుల వద్ద..

కన్నాయిగూడెం(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి, గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టుల వద్ద గోదావరిలోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం రాత్రి వరకు 3,5,910 క్యూసెక్కులతో ప్రవహించిన గోదావరి మంగళవారం ఉదయం 9గంటల వరకు ప్రవాహం పెరిగి 4,67,920 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా నమోదైంది. సాయంత్రం 6గంటలకల్లా గోదావరిలోకి వరద ప్రవాహం మరింత పెరిగింది. ఎగువ నుంచి 5,13,540 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజీలోని మొత్తం 59 గేట్లు ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. తుపాకులగూడెం బ్యారేజీ వద్ద 80.00 మీటర్ల నీటిమట్టం నమోదు కాగా దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 80.80 మీటర్లు నమోదైంది.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అంధకారమే..



సభలోమాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రజలకు మేలు
- గత ప్రభుత్వ తప్పిదాలను ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ వెళ్తున్నాం
- ఎన్నికల హామీలన్నింటినీ నెరవేరుస్తున్నాం
- యూరియాపై రైతులు ఆందోళన చెందొద్దు
- రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కృష్ణకాలనీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్‌స్ ప్రజలకు చేసిందేమీ లేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజలు సుభిక్షంగా ఉన్నారని అన్నారు. భూపాలపల్లి మండలంలోని దూదేకులపల్లి, గొల్లబుద్దారం గ్రామాల్లో రూ.4.30 లక్షలతో నిర్మించనున్న అంతర్గత రోడ్ల పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం గొల్లబుద్దారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు.

గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ చేసిన తప్పిదాలన్నింటినీ ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ పోతున్నామని అన్నారు. తాము గెలిస్తే దళితులను ముఖ్యమంత్రి చేస్తామని చెప్పిన కేసీఆర్ మోసం చేశారని దుయ్యబట్టారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు, ధరణితో భూసమస్యలు ఇలా అనేక రకాల హామీలు ఇచి మోసం చేశారని విమర్శించారు. పేదల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి దూరదృష్టితో పనిచేస్తున్నారని కొనియాడారు. కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత కరెంట్, భూభారతి ఇలా చెప్పుకుంటే అనేక పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతోందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. గిరిజన తండాలు, గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, తన శాఖ తరుపున వచ్చే నిధులను భూపాలపల్లి నియోజకవర్గానికి తప్పక మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉందని, అయినప్పటికీ రైతులు ఆందోళన చెందొద్దని అన్నారు. ఆపరేషన్ సిందూర్ జరిగాక విదేశాల నుంచి రావాల్సిన ముడి సరు దిగుమతి ఆగిపోయిందని, దీని వల్ల ఇబ్బంది అవుతుందని స్పష్టం చేశారు. యూరియా సరఫరా బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని, అయినా సరిపడా యూరియా అందించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక అధికారికంగా పాల్గొన్న మొదటి కార్యక్రమం ఇదేనని మంత్రి అడ్లూరి తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సత్యనారాయణరావు కృషి చేస్తున్నారని, తనతోపాటు ఇద్దరు మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కకు సమస్యలు వివరించి పరిష్కరించుకొనేందుకు పాటుపడటం అభినందనీయమన్నారు.

హామీలు నెరవేరుస్తున్నాం: ఎమ్మెల్యే గండ్ర

గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో చేసిన అప్పులు కడుతూనే సంక్షేమ ఫలాలను పేదలకు అందిస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నామని తెలిపారు. పేదల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని కొనియాడారు. మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ పెంపు, రేషన్‌కార్డుల మంజూరు, రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, 58 వేల ఉద్యోగాలు, రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, వైద్యశాలల మెరుగు తదితర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా మంత్రి అడ్లూరికి ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గాజర్ల అశోక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆర్టీఏ మెంబర్ సుంకరి రాంచంద్రయ్య, నాయకులు అంబాల శ్రీనివాస్, రాంనేని రవీందర్, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూవో మల్లీశ్వరి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

బ్లాక్ మార్కెట్‌లోకి యూరియా!

● అరికట్టలేకపోతున్న అధికారులు ● పట్టుబడితే తప్ప చర్యలు శూన్యం
● నిద్రావస్థలో వ్యవసాయ శాఖ ● రాత్రివేళల్లో పక్కదారిపడుతున్న ఎరువులు

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : రైతులకు అందాల్సిన యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలివెళ్తోంది. నిఘా పెట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ దళారులకు కొమ్ముగాస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పట్టుబడితే గానీ నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్నారే తప్ప ఈ అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ సబ్ డివిజన్ పరిధిలో వ్యవసాయ శాఖ అధికారుల తీరుపై ఈ తరహా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మండలాల వారీగా సాగును బట్టి యూరియా కోటాను కొద్ది కొద్దిగా క్రమేణా కేటాయిస్తూ ఉంటుంది. కొంత మంది మాత్రం ఓ మండలం పేరుతో వచ్చిన కోటాను మరో మండలానికి చెందిన రైతులు, మారు వ్యాపారులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. ప్రధానంగా మహదేవపూర్ మండలంలో ఈ దందా జోరుగా కొనసాగుతోంది. యూరియా లోడు ఉదయం వస్తే రాత్రి 11గంటల తర్వాత ఇతర మండలాలకు చెందిన రైతుల పేరుతో పంపిణీ చేయడం చర్చనీయాంశంగా మారింది. వ్యవసాయ శాఖ అధికారుల ఈపర్వాన్ని చూసిచూడనట్టు వ్యహరిస్తూ ఇది 'మామూలు' విషయమే అన్నట్టు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

గట్టు చప్పుడు కాకుండా తరలింపు

రెండు రోజుల క్రింద మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన అగ్రోస్ మందుల దుకాణానికి యూరియా లోడు వచ్చింది. ఆదివారం అర్ధరాత్రి ట్రాక్టర్ ద్వారా కాటారం మండలానికి చెందిన ఓ గ్రామ రైతుల పేరిట కొంత బిల్ చేయగా ఇంకా కొన్ని ఎలాంటి చెల్లింపులు లేకుండా తరలించినట్లు తెలిసింది. దీనిపై కొంత మంది రైతులు సమాచారం ఇవ్వడంతో యూరియా బస్తాల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను పోలీసులకు ఆపి తనిఖీ చేశారు. యూరియా బస్తాలకు సరైన ఆధారాలు చూపించక పోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఇటీవల మండలంలోని సూరారం గ్రామానికి చెందిన మరో ఫర్టిలైజర్ షాపునకు యూరియా లోడు రాగా ఒక్కో బస్తాను రూ.450కు విక్రయించినట్లు ఆరోపణలు వచ్చాయి. పీఏసీఎస్, అగ్రోస్ కేంద్రాల వద్దకు యూరియా బస్తాలకు వచ్చిన కొందరు రైతులకు ఒక్కొక్కటి ఇస్తూ ఈ-పాస్‌లో మాత్రం రెండేసి, మూడేసి ఇచ్చినట్టు చూపిస్తూ ఆ బస్తాలను పక్కదారి పట్టిస్తున్నట్లు తెలిసింది. ఇలా తరలించిన బస్తాలు ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాల్లో దర్శనమివ్వడమే కాకుండా ఒక్క బస్తాను విక్రయించేందుకు రూ.600 విలువ చేసే ఇతర కంపెనీలకు చెందిన ఫర్టిలైజర్ బస్తాలను రూ.1400కు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అంటే యూరియా పేరుతో ఇతర ఫర్టిలైజర్ అంటగడుతూ ఒక్కో యూరియా బస్తాతో రూ. 800 వరకు దండకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

యూరియా ముసుగులో అవసరం లేని ఇతర ఫర్టిలైజర్‌ను మూడింతలు రేటు పెంచి విక్రయిస్తుండటం గమనార్హం. ఇంకా కొందరు పురుగు మందుల దుకాణదారులైతే వారికి వచ్చిన కోటాను తమకు తెలిసిన వారి ఇళ్లల్లోత నిల్వ చేసి షాపునకు వచ్చిన వారికి అదనంగా వసూలు చేస్తూ విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఇదే కాకుండా మండల కేంద్రంలో ఓ పురుగు మందుల దుకాణానికి ఇప్పటి వరకు నాలుగు లోడ్ల యూరియా రాగా అసలు పంపిణీ జరగకుండానే పక్కదోవ పట్టినట్లు విమర్శలు వినివస్తున్నాయి. వచ్చిన లోడ్లు, పంపిణీ వివరాలను సేకరిస్తే అసలు విషయం బయటకు వస్తుందని మరికొందరు రైతులు చెబుతున్నారు. ఇంకా కొందరు నిర్వాహకులైతే తమ రెగ్యులర్ కష్టమర్లకే ఇస్తామని, మిగతా రైతులకు ఇచ్చేది లేదని తెగేసి చెబుతుండటం కొసమెరుపు. అయినా వ్యవసాయ శాఖ మొద్దు నిద్ర వీడటం లేదంటూ పలువురు రైతులు ఆగ్రహావేశాలకు లోనవుతున్నారు.


మహదేవపూర్‌లో పట్టుబడిన యూరియా తరలించే ట్రాక్టర్(ఫైల్)

సమాచారం ఇస్తే తప్ప..

భయూరియా బ్లాక్ మార్కెట్‌కు వెళ్తోందని, అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఇతర రైతులు లేదా పోలీసులు పట్టుకుని సమాచారం ఇస్తే తప్ప వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల సూరారంలో ఓ ఫర్టిలైజర్ దుకాణంలో గడ్డి మందు కొని చేనుకు పిచికారీ చేయగా పత్తి పూర్తిగా నాశనమైంది. అధికారుల నిఘా కొరవడటం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనిఖీలు నామమాత్రంగా నిర్వహిస్తూ అక్రమ విక్రయాలను అడ్డుకోవడంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంతోపాటు మంత్రి శ్రీధర్‌బాబు ఈప్రాంతంపై దృష్టిసారించి రైతులకు యూరియా పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని, నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన యూరియా కోటాను మండలాల వారీగా విభజించి పంపిస్తుంటే క్షేత్రస్థాయిలో మాత్రం ఇలా ఇష్టానుసారంగా వ్యహరిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు.


పూజశ్రీ


రిషిత


అశ్వతేజారెడ్డి

జాతీయ స్థాయికి పోటీలకు ఎంపిక

బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు

జఫర్‌గఢ్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాల్ బ్యాడ్మింటన్‌లో జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూరు జడ్పీ హైస్కూల్‌కు విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. చవనబోయిన పూజశ్రీ, సుతారి రిషిత (10వ తరగతి), ఉప్పుగల్లు హైస్కూల్‌కు చెందిన అశ్వతేజారెడ్డి (10వ తరగతి) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల కూనూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలతో పాటు హైదరాబాద్ లోని శిక్షణ శిబిరంలో ఉత్తమ ప్రతిభను కనబరచడంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం పర్వేజ్, పీడీ ఆకుల సాయికుమార్ మంగళవారం తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులతో పాటు తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర జట్టు కోచ్ గాదెపాక అయోధ్య, కోశాధికారి కాటం రాజిరెడ్డి అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


సాయిచరణ్


కృతిక

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం లోని ఛాగల్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థి పి.సాయి చరణ్, 8వ తరగతి విద్యార్థిని జె.కృతిక రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. కొమురయ్య మంగళవారం తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లాలోని ముప్కల్ మండల కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పోగుల సారంగపాణి, జిల్లా కార్యదర్శి తోటకూరి గట్టయ్య, పీడీ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఎంసీ చైర్మన్ బూర్ల అనిత, బాస్కుల సమ్మయ్యలు అభినందించారు.

గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా జనార్దన్



ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యో తి): ఏటూరునాగారం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్(డీడీ)గా దబ్బకట్ల జనార్దన్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పోచం పదోన్నతిపై వెళ్లగా ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న జనార్దన్‌ను ఇన్‌చార్జి డీడీగా నియమిస్తూ గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వు లు జారీ చేసింది.

భర్త మరణం తట్టుకోలేక ఆగిన గుండె

● ఎనిమిది రోజుల క్రితం భర్త మృతితో మనస్తాపం
● వృద్ధ దంపతుల మృతితో మల్కాపూర్‌లో విషాదం


యాదమ్మ (ఫైల్)

చిలుపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భర్త మరణం తట్టుకోలేక.. భార్య గుండె ఆగిన విషాదఘటన మంగళవారం జనగామ జిల్లా చిలుపూర్ మండలంలోని మల్కాపూర్‌లో చోటు చేసుకుంది. ఎనిమిది రోజుల తేడాతో ఇద్దరు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం..

మల్కాపూర్‌కు చెందిన ఎలిశాల వెంకటయ్య (76), యాదమ్మ (68) దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవించేవారు. అనారోగ్యం, వృద్ధాప్యంతో ఎనిమిది రోజుల క్రితం మృతిచెందాడు. భర్త మృతిచెందినప్పటి నుంచి యాదమ్మ ముభావంగా ఉంటోంది. ఈక్రమంలోనే సోమవారం రాత్రి గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వారం రోజుల వ్యవధిలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. యాదమ్మ నేత్రాలను సదాశయ ఫౌండేషన్‌కు దానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్, టెక్నీషియన్ నరేందర్, చల్లగురుగుల దళపతి పాల్గొన్నారు.

అవినీతికి తావులేకుండా ప్రజాపాలన

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


చిట్యాలలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

చిట్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అవినీతికి తావులేకుండా రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని రైతువేదికలో చిట్యాల, టేకుమట్ల మండలాలకు చెందిన 80 మంది లబ్ధిదారులకు రూ.25.70 లక్షల చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలన్నింటినీ నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నామన్నారు. రానున్న ఆరు నెలల్లో పింఛన్‌దారులకు రూ.వెయ్యి చొప్పున అదనంగా కలిపి పంపిణీ చేస్తామన్నారు. మహిళలు నెలకు రూ.2,500 అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, వీలైనంత తొందరలోనే ఈ పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనుందని తెలిపారు. స్థానిక సమరంలో గ్రామ స్థాయి నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి మద్దతుగా ప్రతీఒక్కరు నిలబడాలని కోరారు. గ్రామీణాభివృద్ధి కాంగ్రెస్ పాలనతోనే సాధ్యమన్నారు. ఈకార్యక్రమంలో చిట్యాల ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, తహసీల్దార్ ఇమామ్‌బాబా షేక్, టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, చిట్యాల, టేకుమట్ల కాంగ్రెస్ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి, కోటగిరి సతీష్, నాయకులు దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొంరు, దబ్బెట అనీల్, బుర్ర లక్ష్మణ్, బుర్ర శ్రీనివాస్, శంకర్‌గౌడ్, అల్లకొండ కుమార్, సర్వ శరత్ తదితరులు పాల్గొన్నారు.

మేధావుల సదస్సును విజయవంతం చేయాలి

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేష్

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మేధావుల సదస్సును విజయవంతం చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ఈజీఎస్ కౌన్సిల్ సభ్యుడు దండు రమేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. భూపాలపల్లి పట్టణంలోని భారత్ ఫంక్షన్‌హాల్‌లో మేధావుల సదస్సును బుధవారం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సభకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.


వినతిపత్రం సమర్పిస్తున్న అతిథి అధ్యాపకులు

సీఎంకు ఇవ్వలేక.. వనదేతలకు వినతిపత్రం సమర్పణ

తాడ్వాయి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మేడారం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జూనియర్ కాలేజీ అతిథి అధ్యాపకులు వినతిపత్రాన్ని అందించేందుకు ప్రయత్నించారు. సీఎంను కలిసి తమకు పెండింగ్‌లో ఉన్న 8 నెలల జీతాలు ఇప్పించాలని కోరేందుకు సభా ప్రాంగణానికి రాగా వారిని భద్రత బలగాలు అనుమతించలేదు. దీంతో జూనియర్ కాలేజీ అతిథి అధ్యాపకులు తమ వినతిపత్రాన్ని వనదేవత సమ్మక్క గద్దెకు సమర్పించారు. ముఖ్యమంత్రికి తమ సమస్య తెలిసేలా చేయాలని వేడుకున్నామని వారు తెలిపారు.

దేవీ నవరాత్రి ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు పాటించాలి

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవ కమిటీలు తగు జాగ్రత్తలను పాటించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. దుర్గా మాత విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాలతో పాటు మహిళలు బతుకమ్మ ఆడే ప్రాంతాలలో పోలీస్‌శాఖ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ పెట్రోలింగ్ నిర్వహిస్తుందన్నారు. ఉత్సవాలు సజావుగా సాగేందుకు పోలీసుశాఖకు సహకరించాలన్నారు. అగ్నిప్రమాదాలతో పాటు ఇతర అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తగిన ముందస్తు ఏర్పాట్లను చేసుకోవాలన్నారు. దుర్గా మాత విగ్రహాలకు జియో ట్యాగింగ్ చేయాలని అధికారులకు సూచించామని సీపీ తెలిపారు.

ఆర్టీసీ టెండర్‌లో గోల్‌మాల్‌పై ఆరా

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఐదేళ్లకోసారి నిర్వహించే దుకాణాల టెండర్లలో అవకతవకలు జరిగాయని 'ఆర్టీసీ టెండర్లలో గోల్‌మాల్' అనే కథనం సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించగా ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్ స్పందించారు. టెండర్ నిర్వహణలో లోపాలపై ప్రత్యేక అధికారితో దర్యాప్తు చేసినట్టు కొందరు అధికారులు తెలిపారు. గతంలో టెండర్ వేసి డిజిటల్ కీపోయిందని, మళ్లీ టెండర్ వేసి ఎక్కువ టెండర్ వేసిన వారిని తొలగించి అక్రమాలు జరిగినట్టు పత్రికలో రావడంతో టెండర్ పత్రాలను పరిశీలించి అధికారుల పనితీరుపై దర్యాప్తు చేసినట్టు తెలిపారు. టెండర్ ప్రక్రియలో పారదర్శకంగా నిబంధనలు పాటించని అధికారులపై విచారణ జరుపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో రాక్షసపాలన

హైడ్రా పేరిట రూ.50వేల కోట్ల ఆస్తుల ధ్వంసం
చంద్రబాబు కోసమే 'బనకచర్ల'కు నీళ్లు
మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య


నాగారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

లింగాలఘణపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ రాక్షసపాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే టి.రాజయ్య ఆరోపించారు. మంగళవారం నాగారం, కళ్లెం, మాణిక్యాపురం, సిరిపురం, జీడికల్, మందోనిగూడెం, రామచంద్రగూడెం గ్రామాల్లో ఊరూరికి బీఆర్ఎస్ సంక్షేమ ఫలాలు.. ఇంటింటికీ కేసీఆర్ పథకాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. రాజయ్య మాట్లాడుతూ గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేసీఆర్ హయాంలో జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఒరగబెట్టింది ఏమీ లేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన గురువు చంద్రబాబునాయుడికి గురుదక్షిణలో భాగంగా రూ.80వేల కోట్లతో నిర్మించిన బనకచర్ల ప్రాజెక్ట్‌కు 200 టీఎంసీ నీళ్లను రాయలసీమకు ఇస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా నిర్మాణాలు చేపట్టిందేమీ లేదని, హైడ్రాపేరిట 260 ఇళ్లను కూల్చేసి రూ. 50వేల కోట్ల ఆస్తులను ధ్వంసం చేసిందని ఆరోపించారు.

మూసీ ప్రక్షాళన పేరిట మరో రూ.1500 కోట్ల ఆస్తుల ధ్వంసానికి పాల్పడ్డారన్నారు. సీఎం రూ.2.80లక్షల కోట్ల అప్పుతెచ్చి చేసిందేమీ లేదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం మరిచి తెలంగాణను ప్రపంచ చరిత్రలోనే మైలురాయిగా నిలిపిన కేసీఆర్‌ను, కేటీఆర్‌ను, హరీష్‌రావును అవహేళన చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. అనవసర కేసుల్లో ఇరికించే కుట్రలకు రేవంత్‌రెడ్డి విఫలయత్నం చెందుతున్నారన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఓటడిగే హక్కు కేవలం బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాస్ నాయకులు చౌదరిపల్లి శేఖర్, దుంబాల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు 3,800లకు పైగా ఆర్టీసీ బస్సులు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడు జనవరిలో జరగబోయే మేడారం శ్రీసమ్మక్క- సారలమ్మ జాతరకు ఆర్టీసీ నుంచి సుమారుగా 3800లకు పైగా ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్ఎం డి.విజయభాను తెలిపారు. సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులపై మంగళవారం మేడారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశానికి ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ పి.సోలెమాన్, వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను, డిప్యూటీ ఆర్ఎంలు భానుకిరణ్, మహేష్, హనుమకొండ డీఎం ధరంసింగ్‌లు హాజరయ్యారు. జాతరకు ఎక్కువ మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్ఎం తెలిపారు.

ఉపాధి శిక్షణ కోసం దరఖాస్తులకు ఆహ్వానం

మడికొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో ఉచిత ఉపాధి శిక్షణ కోసం గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ (డీఎం) పి.జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చదువు మానేసిన 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, 8వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు టైలరింగ్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు కంప్యూటర్, కమ్యూనిటీ హెల్త్‌వర్కర్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. రెండునెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, 4పాస్ ఫొటోలతో అక్టోబరు, 6 లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఎం కోరారు. మరిన్ని వివరాలకు 7660022525, 7660022526 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విలేకరిని దూషించిన వ్యక్తిపై కేసు

హసన్‌పర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో విలేకరికి ఫోన్ చేసి దూషించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' హసన్‌పర్తి మండల విలేకరిగా పని చేస్తున్న కె.సంజీవ్‌కు ఇదే గ్రామానికి చెందిన ఆరెపల్లి పవన్ ఈ నెల 16న రాత్రి 9.30 గంటల సమయంలో ఫోన్ చేశాడు. ఎమ్మార్పీఎస్ తరఫున తాము తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్యక్రమం చేస్తే పేరు రాయలేదంటూ దూషించాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఫోన్ రికార్డ్ ఆధారంగా పవన్‌పై 351(2), 292, 355 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నేడు ఉమ్మడి జిల్లా స్థాయి వూషు క్రీడా ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ కాపువాడలోని లాలీ డాల్స్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి వూషు క్రీడా ఎంపిక పోటీలను నిర్వహించ నున్నట్లు ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి. ప్రశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17, 19 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఎస్ఎస్‌సీ మెమో వెంట తీసుకొని ఉదయం 9గంటలకు లాలీ డాల్స్ హైస్కూల్ క్రీడా మైదానంలో రిపోర్టు చేయాలని ఆయన ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 9866450592, 9849760799 నెంబర్లలో సంప్రదించాలని ప్రశాంత్ కుమార్ కోరారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7370	5300
మక్కలు	1501	1521
కందులు	4663	3022
పెసళ్లు	5322	3022
పల్లికాయ (సూక)	6500	3500
పల్లికాయ (పచ్చిది)	4550	2400
పసుపు (కాడి)	7560	7889
పసుపు (గోల)	7160	8996
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	15000	12000
యూఎస్341ఏసీ	14200	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పల్లా


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ కల్చరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అఖిల భారత సేవా సంఘం నిర్వహణలో ద రెబల్ అల్గోరిథమ్ అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం జనగామలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 17 ఏళ్ల వయస్సులో యువ రచయిత అజ్మీరాఠాకూర్ ఇంగ్లీషులో పుస్తకాన్ని రాసి ముద్రించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అజ్మీరా స్వామి నాయక్, జి.కృష్ణ, లగిశెట్టి ప్రభాకర్, పెట్లోజు సోమేశ్వరాచారి, అయిలా సోమనర్సింహాచారి, డాక్టర్ మాచర్ల భిక్షపతి, వేముల సదానందం, రంగరాజు ప్రసాద్, చిలుమోజు సాయికిరణ్, పొట్టబత్తిని భాస్కర్, గడ్డం మనోజ్‌కుమార్, తాళ్లపల్లి లక్ష్మణ్, కనకయ్య పాల్గొన్నారు.



సభా వేదికపై రిమోట్ ద్వారా అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



వడి వడిగా సాగిన సీఎం పర్యటన

గద్దెల పరిసరాల్లో పూజారులతో సమీక్ష సమావేశం

- ఆదివాసీ నృత్యాలతో ఘన స్వాగతం
- వనదేవతలకు ప్రత్యేక పూజలు
- 68 కిలోల ఎత్తు బంగారం సమర్పణ

ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, ధనసరి అనసూయ, కొండ సురేఖలతో కలిసి మంగళవారం పర్యటించారు. మేడారం అభివృద్ధి పనులు, సమ్మక్క సారలమ్మల గద్దెల, ప్రాంగణ పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ రూపకల్పన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

హైదరాబాద్ నుంచి బయల్దేరిన సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 12.24 గంటలకు హెలీకాప్టర్ ద్వారా చేరుకున్నారు. మేడారం పరిసరాల్లోని హెలీప్యాడ్‌పై హెలీక్యాప్టర్ ల్యాండ్ అయ్యింది. 12:26 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి హెలీకాప్టర్ దిగారు. అక్కడి నుంచి సీఎంవో వాహనాల్లో పోలీసు కమాండ్ కంట్రోల్ రూం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు ముఖ్యమంత్రికి గౌరవ వందన చేశారు. అక్కడ నుంచి ఆదివాసి కళా నృత్యాలతో దేవస్థానం ప్రధాన ముఖద్వారం నుంచి వారికి పూజారులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. 12:38 గంటలకు సీఎం తులాభారం నిర్వహించారు. సీఎం 68 కేజీలు తూగారు. ఎత్తు బంగారం(బెల్లం), పట్టు వస్త్రాలు పూలు, పండ్లు పసుపు కుంకుమతో 12:39గంటలకు సమ్మక్క గద్దెను చేరుకున్నారు. సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల ప్రాంగణంలో దేవాదాయ అధికారులు పూజారుల చేతుల మీదుగా సీఎంకు తల్లుల పట్టు వస్త్రాలు, ప్రసాదాలు అందించారు. అనంతరం గద్దెల పరిసరాలను పరిశీలించి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకొని స్థలాలను పరిశీలించారు. అక్కడ నుంచి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూజారుల సమావేశానికి 1:01 గంటలకు హాజరయ్యారు. సమ్మక్క సారలమ్మల దేవస్థానం అభివృద్ధిపై పూజారుల అభిప్రాయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై దేవస్థానం ఆధునికీకరణ రూపకల్పన ప్రారంభించారు. పూర్తి డిజైన్లపై ఆర్కిటెక్ రాజశేఖర్ గంట పాటు పూజారులకు వివరించారు. పర్యటనలో భాగంగా సీఎం సమ్మక్క-సారలమ్మలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో ముందుగా ఎత్తు బంగారం తులా భారం వేశారు. ఇందులో సీఎం 68 కిలోలు తూగగా ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కాగా, సీఎం పర్యటనలో గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి పూర్తి స్థాయిలో పూజారులను అనుమతించలేదు. దీంతో పూజారులు అవమానంగా భావించారు. మేడారం దేవస్థానం ఆధునికీకరణ డిజైన్లను సీఎం చేతుల మీదుగా ప్రారంభించే దృశ్యాలను చూడలేక పోయామని అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరికే అవకాశం ఇచ్చి, మిగిలిన వారిని బయటకు పంపించడం బాధాకరమన్నారు.



అమ్మవార్లకు బంగారం తీసుకువస్తున్న సీఎం



గ్యాలరీలో ఉన్న ప్రజలతో కరచాలనం చేస్తున్న సీఎం



ఆదివాసీ సంప్రదాయ నృత్య తలపాగాతో సీఎం రేవంత్



మేడారంలోని వనదేవతల గద్దెల ప్రాంగణంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు



మేడారంలో జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం, మంత్రులు, పూజారులు

అరగంట ఆలస్యంగా ముఖ్యమంత్రి రాక

ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభా వేదికకు అరగంట ఆలస్యంగా చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 1.30 గంటలకు అక్కడికి రావాల్సి ఉండగా 2 గంటలకు చేరుకున్నారు. 2.05 గంటలకు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఉదయం 11 గంటలకు బహిరంగ సభకు వద్దకు చేరుకున్న ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు అప్పటి వరకు వేచి ఉన్నారు. ఈ క్రమంలో కొంత ప్రజలు ఇబ్బంది పడ్డారు. పలువురు మహిళలు వెళ్లిపోయేందుకు సిద్ధపడ్డారు. ఇది గమనించిన పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలు మహిళలను సముదాయించి కూర్చొబెట్టారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి 2.45 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

గంటల తరబడి వేచి ఉన్న భక్తులు

సీఎం పర్యటన నేపథ్యంలో భాగంగా వనదేవతల గద్దెలను భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈ క్రమంలో గద్దెల వద్దకు ఎవరినీ అనుమతించకపోవడంతో తల్లుల దర్శనానికి వచ్చిన భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. సీఎం పర్యటన ముగిసిన అనంతరమే భక్తులను అనుమతించారు.



మేడారం గద్దెల ప్రాంగణంలో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు, ఎంపీలు



సమ్మక్క, గద్దెల నూతన నిర్మాణం నమూనా వ్యూ చిత్రం



సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ పూజారులు, నేతలు



సీఎంకు వస్త్రాలు బహూకరిస్తున్న పూజారుల సంఘం నేత జగ్గారావు



సీఎంకు ఆదివాసీ నృత్యంతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

ప్రజల హృదయాల్లో నరేష్‌రెడ్డి

- చివరివరకు ప్రజాసేవలోనే తరించిన నాయకుడు ఆయన
- మాజీ ఎంపీ ఆర్.సురేందర్‌రెడ్డి, మంత్రి తుమ్మల
- పురుషోత్తమాయ గూడెంలో విగ్రహ ఆవిష్కరణ



నరేష్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

మరిపెడ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దివంగత నేత నూకల నరేష్‌రెడ్డిని ప్రజలు ఎన్నటికీ మరవరని మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని పురుషోత్తమాయగూడెంలోని వ్యవసాయ క్షేత్రం (ఏరువాక)లో ఏర్పాటు చేసిన నూకల నరేష్ రెడ్డి విగ్రహాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంతాప సభలో సురేందర్‌రెడ్డి మాట్లాడారు. నరేష్‌రెడ్డి నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఉన్నా ఎలాంటి పదవులు పొందలేదని పేర్కొన్నారు. 1989 నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ చురుకైన పాత్ర పోషించిన నరేష్‌రెడ్డి.. డోర్నకల్ నియోజకవర్గ టికెట్ ఆశించినా, కొన్ని కారణాల వల్ల వేరే వ్యక్తికి వచ్చిందన్నారు. అయినప్పటికీ ఆయన చివరివరకు ప్రజా జీవితాన్ని కొనసాగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్‌రెడ్డి భార్య రజనిరెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నూకల అభినవ్‌రెడ్డి, భవ్యరెడ్డి, జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, తెలంగాణ రెడ్డి సంఘం గౌరవ అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నరేష్‌రెడ్డి చిరస్మరణీయుడు: మంత్రి తుమ్మల

బతికినంత కాలం ప్రజల కోసమే సేవ చేసిన మంచి నాయకుడు నూకల నరేష్‌రెడ్డి అని, భౌతికంగా లేకపోయినా ఈ ప్రాంత ప్రజల గుండెల్లో ఎప్పటికీ ఆయన ఉంటారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాళి అర్పించారు. పురుషోత్తమాయగూడెంలో నరేష్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. ప్రజల బాగు కోసం ఆనాడు స్నేహ యూత్ ఏర్పాటు చేసి దేశంలోనే ఓ గుర్తింపు తెచ్చిన నేత నూకల అని కొనియాడారు.

కాగా, నూకల విగ్రహానికి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ జాటోతు రామచంద్రునాయక్, ముప్పా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, శంకర్‌నాయక్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కర్నె ప్రభాకర్, ఎనుగుల రాకేష్‌రెడ్డి, పానుగోతు రాంలాల్, గంధశిరి అంబరీష, కాలం రవీందర్‌రెడ్డి, గుండగాని సుందర్‌గౌడ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నిండా ముంచిన మొక్కజొన్న పంట

- కంకిలో గింజలు లేక రైతు నిరాశ..
- ఏపుగా పెరిగినా గింజలు రాకపోవడంతో రైతుల ఆందోళన
- అన్నారం షరీఫ్ గ్రామంలో ఘటన
- రూ. 50 వేల వరకు నష్టపోయిన రైతులు



అన్నారం షరీఫ్ గ్రామంలో మొలకెత్తిన కంకిని చూపెడుతున్న రైతు

పర్వతగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ తండాలో ముగ్గురు రైతుల మొక్కజొన్న పంట ఏపుగా పెరిగినప్పటికీ, కంకిలో గింజలు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రైతు రూ. 50 వేల వరకు పెట్టుబడి పెట్టి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటే గింజల్లో ఎదుగుదల లేకపోవడంతో మోసపో యానని గ్రహించారు. బాధిత రైతు బానోతు యాకూబ్‌తో పాటు మరో ఇద్దరి రైతుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అన్నారం షరీఫ్ శివారులో బానోతు యాకూబ్ మూడెకరాల భూమిలో మొక్కజొన్న పంటసాగు చేశాడు. బానోత్ సహదేవుడు రెండెకరాల్లో, మౌర్య పవన్‌సింగ్ కౌలు రైతుగా రెండెకరాలు సాగు చేస్తున్నారు.

ఈ మేరకు యాకూబ్ అనే రైతు ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన వారి బంధువుల సాయంతో వేంకటేశ్వర ఫర్టిలైజర్స్ షాపులో మొక్కజొన్న విత్తన ప్యాకెట్లను తెచ్చుకున్నారు. దానికి సంబంధించిన బిలుల్లను సైతం తీసుకున్నారు పంట వేసి కాపు కోసం ఎదురు చూస్తుండగా, ఎదుగుదలకు వచ్చిన కంకిలో గింజలు లేకపోవడంతో అవాక్కయ్యారు. తాము ఈ విత్తనాలను వేయడం వల్ల నష్టపోయామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

వనదేవతల దీవెనలతో దొరల పాలన అంతం

(5వ పేజీ తరువాయి)

సమ్మక్క సారలమ్మల దీవెనలు ఉన్నాయని, అన్నీ చక్కబడతాయని దృఢ నిశ్చయంతో వచ్చానని అన్నారు. అనుకున్న విధంగానే వాతావరణం అనుకూలించిందని ఆనందం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రేవంత్‌రెడ్డి అన్నారు. సన్నబియ్యం, రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, దేవాలయాల అభివృద్ధి తదితర అనేక పథకాలు, కార్యక్రమాలను ప్రవేశపెట్టి సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. దళిత, గిరిజన నాయకులకు మంత్రి వర్గంలో ప్రాధాన్యత కల్పించి ఆయా ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నామని అన్నారు. తనకు, మంత్రి సీతక్కకు మేడారం సమ్మక్క-సారలమ్మలు ఏలిన ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అరుదైన అవకాశం దక్కిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు సమ్మక్క-సారలమ్మల దేవాలయాన్ని పునర్నిర్మించే అవకాశం దక్కడం అదృష్టమన్నారు.

ఎన్ని కోట్లయినా ఖర్చు పెడతాం

మేడారం ఆలయ అభివృద్ధికి ఎన్ని కోట్లయినా ఖర్చుపెడతామని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా మేడారం అభివృద్ధి కోసం నిధుల కొరత రానివ్వమన్నారు. అభివృద్ధి పనుల్లో ఆదివాసీలను భాగస్వాములను చేస్తామని తెలిపారు. రీసెర్చ్ స్కాలర్‌లను కలుపుకొని పని చేస్తామని అన్నారు. ఈ పనులు 100 రోజుల్లో పూర్తిచేసేందుకు సంకల్పం పెట్టుకున్నామని, పనులు వేగవంతం కావడానికి ఈ ప్రాంత ప్రజలు సహకారాన్ని అందించాలని కోరారు. అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టేందుకు 2వేల మంది వర్కర్లతో రాత్రింబవళ్లు పనులు జరిపించాలన్నారు. ఆ పనులను ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నెలలో నాలుగుసార్లు ఇక్కడికి వచ్చి పరిశీలించాలన్నారు. సమ్మక్క'సారలమ్మల దేవాలయంతో పాటు జంపన్నవాగు, రహదారుల నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. అయ్యప్పమాల వేస్తే ఏ విధంగా దీక్షతో ఉంటారో.. మేడారం దేవాలయం పనులు పూర్తిచేసేందుకు కూడా అంతే చిత్తశుద్ధితో ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు బలరాంనాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, తెల్లం వెంకటరావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, దేవాదాయ శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవి అవతారంలో దుర్గామాత



ఏటూరునాగారంలో అమ్మవారి సన్నిధిలో భవానీ దీక్షధారులు

ఏటూరునాగారం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీదేవీశరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం శ్రీగాయత్రీదేవి ఆలకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్టార్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని ఆలకరణ చేశారు. అర్చకులు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ జరిగాయి. ఈ కార్యక్రమంలో స్టార్ యూత్ ఉత్సవ కమిటీ సభ్యులు నూక ప్రభాకర్, సాయి, భక్షపతితో పాటు భవానీ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

● భూపాలపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి): శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో దేవీశరన్నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం గాయత్రీదేవిగా దుర్గామాత దర్శనమిచ్చారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన సతీమణి జ్యోతి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద మంత్రాలతో దుర్గాదేవి కొలిచారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, ఎర్రగుంటపల్లిలో, లక్ష్మీదేవర ఆలయం వద్ద, దన్వాడ దత్తాత్రేయస్వామి ఆలయంలో, గూడూరులో కొలువు దీరిన దుర్గామాత మండపాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం దుర్గామాత గాయ త్రీదేవి రూపంలో దర్శనమివ్వగా పలువురు భక్తులు దర్శించుకుని మొక్కుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, పలు రకాల నైవేద్యాలను సమర్పించారు. ఆర్యవైశ్య మహిళలు మండపంలో భజన చేశారు. వేదపండితులు కృష్ణ మోహన్, నాగరాజు, గణేష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, నిర్వాహకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట (ఆంధ్రజ్యోతి) దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు మండలంలోని కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం, తిమ్మంపేట, మల్లూరు, పాలాయి గూడెం, రమణక్కపేట, రాజుపేట తదితర గ్రామాల్లో ఘనంగా జరుగుతున్నాయి. దుర్గమ్మ విగ్రహాల వద్ద భక్త మండలి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహిస్తున్నారు. అమ్మవారిని మంగళవారం శాకాంబరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

● వాజేడు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు దుర్గమ్మ దేవి గాయత్రీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. శంఖం, చక్రం, గద, అంకుశం ధరించి శోభాన మూర్తిగా అమ్మవారిని అలంకరించారు. ఆలయంలో ప్రత్యేకంగా కుంకుమ పూజలు నిర్వహించగా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లను చేశారు.

● మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారులు అమ్మవారిని గాయత్రీమాత రూపంలో అలంకరించి పూజలు నిర్వహించగా మాల ధారులు పాల్గొన్నారు. పూజాది కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగమల్ల దుర్గయ్య, దేవేందర్, మల్లేష్, మండల రాజు, పుట్టల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లిలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దంపతుల పూజలు



కాటారంలో దుర్గామాత భక్తులు





వాజేడు, మంగపేటలో అమ్మవారు

వ్యవసాయ శాస్త్రవేత్తల క్షేత్ర పరిశీలన



కన్నాయిగూడెం మండలంలో వరి పొలం వద్ద శాస్త్రవేత్తలు

వెంకటాపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాలంపేట, వెంకటాపూర్ గ్రామాల్లో తెలంగాణ యూనివర్సిటీ వ్యవసాయ శాస్త్రవేత, స్థానిక వ్యవసాయ అధికారులు మంగళవారం క్షేత్రప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త విద్యాసాగర్ వరిపంట చిరుపొట్ట దశలో ఉండడాన్ని గమనించి ఎకరాకు యూరియా, పొటాష్ వేసుకోవాలని రైతులకు సూచించారు. ఈదశలో వచ్చే కంకినల్లి నివారణకు స్పిరోమెసిఫెన్ 1 మిల్లీలీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని, దోమపోటు నివారణకు బిప్రోఫేసన్ 1.6మిల్లీలీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శైలజ, వ్యవసాయ విస్తరణాధికారులు సునీల్, సుకుమార్, రైతులు కారుపోతుల సత్యం, సారంగపాణి, నరెడ్ల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

● కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): రైతన్నకు నేస్తం పథకం ద్వారా డబ్ల్యూజీఎల్ 962 అనే వరి విత్తన రకాలు సాగవుతున్న పంటలను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్ర వేత్తలు మధు, గోన్య నాయక్, మండల వ్యవసాయ అధికారి మహేష్‌తో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. వరి పంట చిరు పొట్ట దశలో ఉన్నప్పుడు ఎకరాకు 25 కేజీల యూరియా, పొటాష్ మందులు పంటలో వేయాలన్నారు. ఈ దశలో వచ్చే కంకి నల్లి నివారణకు లీటరు నీటిలో స్పిరోమేసిన్ 1 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కల్యాణి, రైతులు వనపర్తి రామయ్య, పొడెం శోభన్, తడకల భాస్కర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు

వెంకటాపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ సెక్టార్ అడవిరంగాపూర్, నర్సాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణమాసోత్సవాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా సీడీపీవో శిరీష మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, గర్భిణు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ప్రభుత్వం ఆరోగ్యలక్ష్మి ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ కళావతి, ములుగు డీసీ మమత, బ్లాక్ కోఆర్డినేటర్ వెంకటరాజు, స్టేట్ ఈక్వాలిటీ నాగేశ్వర్‌రావు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు, పిల్లలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య శిబిరం



వాజేడులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దీక్షిత్

వాజేడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మానసిక వైద్యనిపుణుడు డాక్టరు దీక్షిత్ కుమార్ పాల్గొని మానసిక రుగ్మతలను కలిగి ఉన్న వారిని పరీక్షించి మందులు అందజేశారు. మొత్తం 121 మందిని పరీక్షించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టరు మహేందర్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో...

వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మంగళవారం వైద్యాధికారులు జ్యోతి, యోషితలు 291మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఆశిష్, భాస్కర్, సిబ్బంది కోటిరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వేలం

ఏటూరునాగారం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 24న వేలం పాట వేయనున్నట్లు ఎక్సైజ్‌శాఖ సీఐ రమేష్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు వాహనం విలువలో 50శాతం డిపాజిట్ చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. వాహనాల వేలం ప్రకియ ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోషకాహారం తీసుకోవాలి

కాటారం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య రక్షణ కోసం ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ అన్నారు. మండలంలోని దామెరకుంట జీపీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. పిల్లల తల్లులు, గర్భిణులు, కిషోర బాలికలకు పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సమతుల ఆహారంలో భాగంగా పాలు, గుడ్లు, ఆకుకూరలు, పండ్లను విరివిగా తీసుకోవాలని, దీంతో పలు రకాల వ్యాధులు దరిచేరవని, ఆరోగ్య రక్షణ ఉంటుందని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లతో కలిసి గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏఎన్ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జయలక్ష్మి, త్రివేణి, వసుమతి, కౌసల్య, ఆయాలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఏపీఎంకు సన్మానం

చిట్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య ఇన్‌చార్జి ఏపీఎం గుర్రపు రాజేందర్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో సన్మానించారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్రప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య మాట్లాడుతూ స్థానిక దళిత కాలనీకి చెందిన రాజేందర్ వృత్తిలో నిబద్ధతతో పనిచేస్తు అంచెలంచెలుగా ఎదుగుతూ గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. మండలంలోని మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక ఎదుగుదలకు కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏవైఎస్ మండల అధ్యక్షుడు జన్నె యుగేందర్, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోల్కొండ బిక్షపతి, ఏవైఎస్ నాయకులు కట్కూరి రాజు, పుల్యాల సురేష్, శీలపాక నాగరాజు, పుల్ల ప్రభాకర్, జీడి సురేష్, భాస్కర్, షైదం మహేష్, గుర్రం తిరుపతి, చందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

మల్హర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపుపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని కొయ్యూర్‌లో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. జీఎస్టీ తగ్గించిన ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండ శ్రీకాంత్, నాయకులు గంగాధరి సమ్మయ్య, మహేందర్ రెడ్డి, సతీష్ రెడ్డి, రాయమల్లు, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

గణపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మైలారం గ్రామ పంచాయతీలో మంగళవారం ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయుష్ శాఖ పదో ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి సిహెచ్. మధుసూదన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఆరోగ్య శిబిరంలో ప్రజలకు మోకాళ్ల, ఒంటి నొప్పులు, చర్మ సంబంధిత, షుగర్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రజలకు యోగా విశిష్టత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తనూజరాణి, సారంగపాణి, జగదీష్, పరమేశ్వర్, సుమన్, విజయ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికుల రక్షణ బాధ్యత కంపెనీలదే,,

కాటారం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం వలస వచ్చి పనులు నిర్వహించే కార్మికుల బాధ్యత ఆయా కంపెనీలదేనని యూఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ అన్నారు. మండలకేంద్రంలో పలు ప్రజా సంఘాల నేతలతో కలిసి వారు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సూర్యాపేట జిల్లాలో దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీలో మృతి చెందిన బీహార్ రాష్ట్ర కార్మికుడికి పరిహారం ఇవ్వాలని తోటి కార్మికులు ఆందోళన చేస్తే కంపెనీ యాజమాన్యం పోలీసులతో అణచివేయడమే కాక కార్మికులపై కేసులు నమోదు చేయించడం దుర్మార్గమైన చర్యగా మండిపడ్డారు. కార్మికులపై కంపెనీలు మానవతాధృక్పథం చూపకుండా కేవలం లాభాపేక్ష నే చూడటం తగదన్నారు. శ్రమజీవులపై జరుగుతున్న దారుణాలను రాజకీ య పార్టీలు, సంస్థలు, కార్మిక సంఘాలు ఐక్యంగా ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌పీఎస్‌పీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోకన్వీనర్ ఐతు బాపు, ఆదివాసీ సంఘాల నేతలు రాజమణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎక్స్‌లెన్స్ అవార్డు

మహదేవపూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు బి.ప్రభాకర్ రెడ్డి, మడక మధుకు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ అందించే నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. విద్యార్థులకు తమదైన శైలిలో భోదిస్తూ ఉన్నతంగా తీర్చిదిద్దడంలో భాగస్వామ్యం వహిస్తున్నందుకు ఈ అవార్డు వచ్చినట్లు తెలిపారు. ఈనెల 25న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో వీరు సత్కారం పొందనున్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మధుసూదనాచారి

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ మధుసూదనాచారి పరామర్శ

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మంగళవారం పర్యటించారు. రంగాపురంలో అనారోగ్యంతో మృతిచెందిన జీపీ కార్మికుడు చిలువేరు సారయ్య, మేదరమెట్లలో గట్టు పద్మ, గణేష్‌పల్లిలో నగలగాని కమల, ఇప్పలపల్లిలో దూడపాక ఓదెలు కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా మొగుళ్లపల్లి, కొర్కిశాల, ములుకలపల్లి, పోతుగల్లు గ్రామాల్లో దుర్గామాతను దర్శించుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు చదువు అన్నారెడ్డి, దానమే రాములు, సూరినేని రవీందర్‌రావు, దోమకుంట్ల రమేష్ ఆనంద్, నరేష్, తదితరులు ఉన్నారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

ఆదివాసీ సంఘాల రాష్ట్ర జేఏసీ చైర్మన్ రామకృష్ణ

వెంకటాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ సంఘాల రాష్ట్ర జేఏసీ చైర్మన్ చుంచా రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని కొమరంభీం విగ్రహం వద్ద ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లా డారు. వలస బంజారాల వల్ల ఆదివాసీలు అస్థిత్వాన్ని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారని అన్నారు. తాజాగా ఆదివా సీల ఇలవేల్పులైన సమ్మక్క-సారలమ్మ, పాల్వంచ పెద్దమ్మతల్లి, ఇల్లందు కట్టమైసమ్మ దేవతలు సైతం మావేనంటూ చెప్పుకుంటూ మా ఇలవేల్పులను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దీంతో ఆదివాసీతెగల మనోభావాలు దెబ్బతింటున్నాయని పేర్కొ న్నారు. ఈవిషయమై ఆదివాసీ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి ఐక్యం గా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ ఈనెల 28వతేదీన భద్రాచలంలో నిర్వహించే ధర్మయుద్ధభేరి బహిరంగసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు కొర్సా నర్సింహమూర్తి, వాసం నాగరాజు, శేషగిరి, పసుల సూర్యనారాయణ, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

రైతులకు తప్పని యూరియా తిప్పలు

కాటారం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): యూరియా బస్తాల కోసం తమకు ఇక్కట్లు తప్పడం లేదని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంటల కొద్దీ వేచిచూసినా ఒకట్రెండు బస్తాలే దొరుకుతున్నాయని, కొన్ని కేంద్రాల వారు అక్రమంగా అమ్ముకుంటున్నారని పలువురు అంటున్నారు. గంగారంలో డీసీఎంఎస్-2 సెంటర్ వద్ద మంగళారం ఉదయం 7గంటల నుంచే చెప్పులను లైన్‌లో పెట్టి యూరియా బస్తాల కోసం వేచిచూడటం కనిపించింది. గారెపల్లి పీఏసీఎస్ సెంటర్ వద్ద సైతం 440 యూరియా బస్తాలు రాగా పలువురు రైతులు బారులు తీరారు. ఏడీఏ శ్రీపాల్, ఏవో పూర్ణిమ తమ ఏఈవోలతో, పీఏసీఎస్ సీఈవో సతీష్ తమ సిబ్బందితో కూపన్లు రాయించి ఒక్కో రైతుకు బస్తా చొప్పున పంపిణీ చేశారు. పోలీసులు ఆయా కేంద్రాల వద్ద గొడవలు జరగకుండా రైతులను నియంత్రించారు. రెండు, మూడు రోజుల్లో మరిన్ని ఎరువుల బస్తాలు అందుబాటులోకి రానున్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని అధికారులు రైతులకు తెలిపారు.

అధికారుల తనిఖీలు

మండలంలోని గంగారం గ్రామంలో నిర్వహిస్తున్న డీసీఎంఎస్-2 కేంద్రాన్ని మంగళవారం ఏడీఏ శ్రీపాల్ నేతృత్వంలో ఏవో పూర్ణిమ, ఏఈవోలు అస్మా, రాజన్న తనిఖీలు నిర్వహించారు. కేంద్రానికి కేటాయించిన యూరియా బస్తాలను సక్రమంగా విక్రయించడం లేదని పలువురు రైతులు చేసిన ఫిర్యాదుతో అధికారులు షాపులో తనిఖీలు చేపట్టారు. కేంద్రానికి కేటాయించిన 220 యూరియా బస్తాలకు సంబంధించి ఏవో అనుమతి లేకుండా విక్రయాలు చేసి వివరాలను ఈ-పాస్ యంత్రంలో నమోదు చేయకపోవడం, సరైన రీతిలో బిల్లులు రాయకపోవడం గుర్తించామని ఏడీఏ తెలిపారు. మంగళవారం 72యూరియా బస్తాలు మాత్రమే కేంద్రంలో ఉండగా వాటిని రైతులకు పంపిణీ చేశామన్నారు. రైతుల ఫిర్యాదు, తనిఖీల్లో తేలిన అంశాలతో డీసీఎంఎస్-2 కేంద్రాన్ని తాత్కాలికంగా సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. యూరియా బస్తాలను అధిక ధరలకు విక్రయించినా, అక్రమంగా అమ్మినా చర్యలు తప్పవని ఏడీఏ హెచ్చరించారు.



గంగారంలో చెప్పులను లైన్‌లో పెట్టిన రైతులు

విద్యుత్ షాక్‌తో కేబుల్ ఆపరేటర్ మృతి



ఓదెలు (ఫైల్)

టేకుమట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో కేబుల్ ఆపరేటర్ మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సోమన్‌పల్లి గ్రామానికి చెందిన సాద ఓదెలు 25 సంవత్సరాలుగా సోమన్‌పల్లి, అంకుషాపూర్ గ్రామాలలో కేబుల్ ఆపరేటరు (డిస్ కనెక్షన్లు) ఇస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం సోమన్‌పల్లిలో నూతన కనెక్షన్ ఇచ్చేందుకు కరెంట్ పోల్ ఎక్కి డిష్ తీగలు సర్దుతుండగా ప్రమాదవశాత్తు పైన ఉన్న 11 కేవీ విద్యుత్ తీగ తాకింది. దీంతో కరెంటు షాక్ తగిలి పోల్‌పై నుంచి సీసీ రోడ్డుపై పడిన ఓదెలుకు తలకు బలమైన గాయాలు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మృతుడు ఓదెలు కుటుంబాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు.

సీఎం, డీప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

కృష్ణకాలనీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో ఐఎన్‌టీయూసీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుల చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. సింగరేణి కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటా ఇవ్వడాన్ని హర్షిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఐఎన్‌టీయూసీ నాయకులు బేతెల్లి మధుకర్‌రెడ్డి, పసునూటి రాజేందర్, జోగ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కరువు భత్యం ప్రకటించాలి

మాదిగ ఉద్యోగుల సంఘం నేత దయాకర్

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులందరికీ కరువు భత్యం ప్రకటించాలని మాదిగ ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి బొడ్డు దయాకర్‌మాదిగ డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలోని ఓ కళాశాల ఆవరణలో భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు హర్షం స్వామి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో దయాకర్ మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు కుమ్మరి రాజన్నమాదిగ, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద రాజుమాదిగ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం : సింగరేణి జీఎం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం

కృష్ణకాలనీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవనానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లిలోని కృష్ణకాలనీలో ఉన్న సింగరేణి మినీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన కంపెనీ స్థాయి బాడీబిల్డింగ్, వేయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. సింగరేణి సంస్థలో క్రీడలు ఒక వేడుకలా నిలుస్తాయన్నారు. నేటి ఆధునిక జీవన విధానంలో క్రీడల పాత్ర మరింత ప్రాధాన్యతను సంతరించుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి క్రీడల గౌరవ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, సీఎంవోఏ భూపాలపల్లి ఏరియా అధ్యక్షులు యండి. నజీర్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి రమేష్, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు బేతెల్లి మధుకర్‌రెడ్డి, క్రీడా కోచ్‌లు పాల్గొన్నారు.